క్లుప్తంగా

హిందువులపై దాడులు సరికాదు



బంద్‌లో పాల్గొన్న నాయకులు

కుల్కచర్ల: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు చేయడం సరికాదని అఖిలపక్ష నాయకులు పేర్కొన్నారు. గురువారం చౌడాపూర్ మండల కేంద్రంలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బంద్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిందువులపై ఉద్దేశపూర్వకంగా దాడులు చేసేవారిపై చర్యలు తీసుకునేలా భారతదేశం ఆ దేశ పాలకులపై ఒత్తిడిని తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా హిందువులందరూ ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, మాజీ జెడ్పీటీసీ రాందాస్ నాయక్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు బందయ్య, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

టైపిస్టుకు సన్మానం



వెంకటేశ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న యువకులు

దోమ: మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ముద్దం వెంకటేశ్‌యాదవ్ ఉత్తమ టైపిస్టుగా ఎంపికయ్యాడు. 78వ స్వాతంత్ర్య వేడుకల్లో స్పీకర్ ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ మేరకు వెంకటేశ్ యాదవ్ స్వగ్రామం బొంపల్లి యువకులు గురువారం ఆయనను శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నర్సింహాయాదవ్, బషీర్, భీమయ్య, సాయిసంతోష్, మల్లేశ్ యాదవ్, ప్రశాంత్, నర్సింహ పాల్గొన్నారు.

ఏఈఓకు సన్మానం



త్రైలోక్యను సన్మానించిన రైతులు

ధారూరు: మండలంలోని నాగసమందర్ క్లస్టర్ ఏఈఓ త్రైలోక్య బదిలీ అయ్యారు. గురువారం రైతులు ఆమెను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అలాగే కొత్తగా వచ్చిన ఏఈఓ హరిప్రసాద్‌కు స్వాగతం పలికి, సన్మానించారు. కార్యక్రమంలో బస్వరాజ్, మల్లారెడ్డి, కుమ్మరి వీరేశం, లాల్ అహ్మద్ పాల్గొన్నారు.

పంట వివరాలు నమోదు చేసుకోవాలి

ఏఈఓ మహేశ్



పంట వివరాలను నమోదు చేస్తున్న మహేశ్

మర్పల్లి: నెలాఖరు వరకు రైతులు సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని సిరిపురం క్లస్టర్ రైతు వేదిక ఏఈఓ మహేశ్ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని కొత్లాపూర్ గ్రామంలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను అడిగి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట దిగుబడి వచ్చిన తరువాత మార్కెట్‌లో విక్రయించుకోనేందుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రతి రైతుతప్పనిసరిగా పంట వివరాల నమోదును రాయించుకోవాలన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

అనంతగిరి: వికారాబాద్ మండలం పీరంపల్లి గ్రామంలో కల్తీకల్లు తాగి ఆస్పత్రి పాలైన బాధితులకు వెంటనే మెరుగైన వైద్యం అందించాలని ఐద్వా సంఘం జిల్లా అధ్యక్షురాలు అనసూయ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆమె ఆయా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్యం ఖర్చులను ప్రభుత్వమే భరించాలన్నారు. వెంటనే మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారులు సందర్శించాలన్నారు. కల్తీకల్లు అమ్ముతున్న డిపోలపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు.



తాండూరు: తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నేతలు



పరిగి: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

మాఫీ.. మంటలు

రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలనే డిమాండ్‌తో గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల కేంద్రాల్లో రైతులు, పార్టీ కార్యకర్తలు నిరసన తెలిపి, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



దుద్యాల్: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి



పూడూరు: మన్నెగూడ చౌరస్తాలో..



బంట్వారం: కోట్‌పల్లిలో..



మోమిన్‌పేట: ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నేతలు



దోమ: సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు



మర్పల్లి: ధర్నా చేస్తున్న నాయకులు, రైతులు



కుల్కచర్ల: ప్రధాన చౌరస్తాలో..

నాణ్యమైన భోజనం అందించాలి

ఎంపీడీఓ అనురాధ

నవాబుపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ అనురాధ ఉపాధ్యాయులను ఆదేశించారు. మండలంలోని కేశవపల్లి తండాలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండే వారు లేక విద్యార్థులకు భోజనం అందించడం లేదు. దీంతో విద్యార్థులు మధ్యాహ్నం ఇంటికి వెళ్లి భోజనం చేసి మళ్లీ వస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ, ఎంఈఓ గోపాల్‌తో కలిసి పాఠశాలను సందర్శించారు. ఎప్పటినుంచి భోజనం అందించడం లేదని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఇక నుంచి వంట మనిషిని పెట్టుకొని భోజనం ఇవ్వాలని ఉపాధ్యాయినీ అమృతకు సూచించారు.గ్రామస్తులు ఎవరైనా ముందుకు వచ్చి వంట చేయాలని కోరారు.



దోమ: భోజనాన్ని పరిశీలిస్తున్న వెంకట్

పాఠశాలల తనిఖీ

దోమ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఎస్ఓ నోడల్ ఆఫీసర్ వెంకట్ అన్నారు. గురువారం మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. వెంకట్ మాట్లాడుతూ.. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నిర్లక్ష్యం వహించరాదని, తరగతి గదులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

వార్డుల వారీగా ఓటరు జాబితా

ఎంపీడీఓ విశ్వప్రసాద్

తాండూరు రూరల్: వార్డుల వారీగా ఓటర్ల జాబితాను రూపొందించాలని ఎంపీడీఓ విశ్వప్రసాద్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ...పార్లమెంట్ ఓటరు జాబితా ఆధారంగా గ్రామాల్లో ఓటర్లను వార్డుల వారీగా విభజించాలన్నారు. ఇంటి నంబర్‌తో పాటు కుటుంబ సభ్యులు అందరూ ఒకే వార్డుల్లో ఉండేలా చూడాలని సూచించారు. కార్యదర్శులు నిర్లక్ష్యం వహించొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ ఆనంద్‌రావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ సంతోష్‌కుమార్

పరిగి: ప్రతి ఒక్కరూ పోలీసు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని పరిగి ఎస్ఐ సంతోష్ కుమార్ అన్నారు. గురువారం పరిగి మండలం నస్కల్‌గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా చట్టరీత్యానేరమన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే 100 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ఆకతాయిలు ఇబ్బందులకు గురిచేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. కొంతమంది ఉపాధి కల్పిస్తామని దూర ప్రాంతాలకు తీసుకువెళ్లి ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉందని సూచించారు. సమాజంలో జరుగుతున్న మంచి, చెడులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాష్‌కుమార్, పాఠశాల ప్రత్యేకాధికారి సుల్తానా, సిబ్బంది ఆలీమొద్దిన్ పాల్గొన్నారు.

అసోసియేషన్‌తో వారికి సంబంధం లేదు



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

- ఐదేళ్ల కాలపరిమితితో నూతన కమిటీని నియమించాం
- ముస్లిం వెల్ఫేర్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఖుర్షీద్, హాదీశాహేరీ

తాండూరు: ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ప్రతినిధులమని చెప్పుకుంటున్న వారిపై ఇప్పటికే పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని అసోసియేషన్ తాండూరు అధ్యక్ష, కార్యదర్శులు ఖుర్షీద్ హుస్సేన్, ఎంఏ హాదీశాహేరీ పేర్కొన్నారు. గురువారం వారు మాట్లాడుతూ.. 1997 అసోసియేషన్ రిజిస్ట్రేషన్ అయిందని, నాటి నుంచి కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. 2018లో సంస్థను మరోసారి రెన్యువల్ చేసుకున్నామని, 660 7/97 నంబర్‌తో కొనసాగుతుందని పేర్కొన్నారు. అనంతరం 2019లో ఐదేళ్ల కాలపరిమితికి గాను 30 మంది అసోసియేషన్ సభ్యులతో నిబంధనల ప్రకారం నూతన కార్యవర్గం ఏర్పాటు చేసుకున్నామన్నారు.

వారి మాటలు అర్థరహితం

తమ వర్గంలోనే కొందరు ఇదే రిజిస్ట్రేషన్ నంబర్‌తో కొనసాగుతూ.. కమిటీ ప్రతినిధులమంటూ చలామణి అవుతున్నారని, వారిపై గతేడాది మార్చిలో తాండూరు ఠాణాతో పాటు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని చెప్పారు. దీంతో కమల్ అత్తార్, ఖాలీద్ సైఫుల్లాతో పాటు పలువురిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు అయిందని వివరించారు. అలాంటిది వారే తాజాగా కమిటీ నుంచి తమ సభ్యత్వం రద్దు చేస్తున్నామని అనడం అర్థరహితమని, తమదే రిజిస్ట్రేషన్ పొందిన అసోసియేషన్ అని ఖుర్షీద్ హుస్సేన్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ ముజాహిది, ట్రెజరర్ అబ్దుల్ సత్తార్ ముజాహిది, ప్రతినిధులు అరూల్‌ఖాన్, తౌఫిక్ పటేల్, లాయక్‌అలీ, అబ్దుల్ రజాక్, రహీం, రషీద్, ముజీబ్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మపేరుతో ఒక మొక్క నాటాలి

ఎంపీడీఓ జర్నప్ప



మొక్క నాటుతున్న కార్యదర్శి సురేష్, నాయకులు



మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ జర్నప్ప

పెద్దేముల్: ప్రతి ఒక్కరూ అమ్మపేరుతో ఒక మొక్క నాటాలని ఎంపీడీఓ జర్నప్ప అన్నారు. గురువారం మండల కేంద్రంలో 'నాటుదాం ఓ మొక్క అమ్మ పేరు' తో అనే కార్యక్రమంలో భాగంగా మొక్కలు మండలంలోని 37 గ్రామ పంచాయతీ కార్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొక్కల పెంపకంతో వన మహోత్సవ కార్యక్రమాలకు లక్షల రూపాయాల నిధులు ఖర్చు చేస్తామన్నారు. ఖాళీ ప్రదేశాల్లో, పాఠశాల ఆవరణ, అంగన్‌వాడీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మొక్కలు నాటాలన్నారు. చెట్లు ఉంటేనే వర్షాలు కురుస్తాయని, వర్షాలు కురుస్తేనే రైతులు, ప్రజలు అన్ని విధాల బాగుపడుతారన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రతన్‌సింగ్, ఉపాధి హామీ పోగ్రాం అధికారి నర్సింలు, ఈసీ కృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్లు అంజయ్య , ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని బోట్యానాయక్ తండా గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేశ్ అన్నారు. గురువారం మండలం బోట్యానాయక్ తండాలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. మొక్కలు విరివిగా పెరగడంతో ఆహ్లాద వాతావరణం ఏర్పాటుతుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య, నాయకులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

దోమలో..

దోమ: 'నాటుదాం అమ్మ పేరు ఒక చెట్టు' అనే కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలోపాల్గొన్న ఎంపీడీఓ మహేష్‌బాబు మాట్లాడుతూ.. మొక్కలు నాటడం వల్ల ప్రకృతి ఆహ్లాదకరంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రజిత, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విజయలక్ష్మి, ఎంపీఓ సోమలింగం, వైద్య సిబ్బంది ప్రభులింగం, ఏపీఓ దస్తయ్య, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

పెద్దేముల్ ఏఓ బదిలీ

పెద్దేముల్: మండల వ్యవసాయ అధికారి నజీరొద్దిన్ ఆలేజ్ జనగాం జిల్లాకు బదిలీ అయ్యారు. మండలంలో ఏడేళ్లు రైతులు, ప్రజలకు అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు చేశారని ఆయా గ్రామాల రైతులు అన్నారు. కాగా, పెద్దేముల్ మండలానికి కొత్త ఏఓను ప్రభుత్వం ఇంకా నియమించలేదు. అలాగే, మండల మంబాపూర్ క్లస్టర్ నుంచి ఏఈఓగా పని చేసిన బాల కోటేశ్వర్లు కూడా చేవెళ్లకు బదిలీ అయినట్లు సంబంధిత అధికారులు చెప్పారు.

నూతన నియామకం

కుల్కచర్ల: సేవాలాల్ సేన కుల్కచర్ల మండల అధ్యక్షుడిగా గోరిగడ్డ తండా గ్రామపంచాయతీకి చెందిన అంగూర్‌నాయక్ నియమించారు. గురువారం జిల్లా కార్యాలయంలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు సంజునాయక్ చేతులమీదుగా అంగూర్ నాయక్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగూర్‌నాయక్ మాట్లాడుతూ.. మండలంలో గిరిజన ప్రజలు అత్యధిక సంఖ్యలో ఉన్నారని, వారి అభ్యున్నతికి తమవంతుగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వాలు గిరిజన ప్రజల అభ్యున్నతికి మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అజయ్‌నాయక్, జిల్లా సేవాలాల్ సేన అధ్యక్షుడు శంకర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే తాండూరుకు కాగ్నానది నీరు



పంపు హౌస్‌ను పరిశీలిస్తున్న స్వప్న, అధికారులు



లీకేజీలను పరిశీలిస్తున్న దృశ్యం

మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న

తాండూరు టౌన్ : మిషన్ భగీరథ తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయంగా త్వరలోనే తాండూరుకు కాగ్నానది నుంచి నీటి సరఫరాను పునరుద్ధరించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న అన్నారు. గురువారం ఆమె పాత తాండూరులోని పంపు హౌస్‌ను మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, డీఈ ఖాజా హుస్సేన్‌లతో కలిసి సందర్శించారు. పలు మోటారు పంపులను అందుబాటులోకి తీసుకు వచ్చారు. కొద్దిసేపు ట్రయల్‌రన్ నిర్వహించి పైపులైన్లలో లీకేజీ ఎక్కడ ఉందో పాయింట్లను గుర్తించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా పట్టణానికి మిషన్‌భగీరథ నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. మిషన్ భగీరథ రాని రోజుల్లో పాతవిధానంలో కాగ్నానది నుంచి పట్టణానికి తాగునీటిని సరఫరా చేయాలని నిర్ణయించామన్నారు. నాలుగైదు రోజుల్లో మరమ్మతులు చేయించి, తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ

పరిగి: అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ అవుతుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమన్న గారి పశురాంరెడ్డి అన్నారు. గురువారం రుణమాఫీ కాని రైతుల నుంచి వ్యవసాయాధికారులకు దరఖాస్తులు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. కొంతమందికి టెక్నికల్ సమస్యల కారణంగా మాఫీ కాలేదని.. వారికి కూడా త్వరలోనే అవుతుందని చెప్పారు. కొందరికే జరిగిందని, ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు తావుర్య నాయక్, నర్సింలు, గణేష్, రాములు పాల్గొన్నారు.



రైతువేదిక వద్ద పరశురాంరెడ్డి, తదితరులు

అధిక యూరియా.. అనర్థమే

రసాయన ఎరువులు అధికంగా వాడటంతో అనర్థమేనని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. దిగుబడి తగ్గి పెట్టుబడి ఖర్చులు పెరుగుతాయని చెబుతున్నారు. యూరియా ఎక్కువ మోతాదులో వాడటం వల్ల పంటలు తెగుళ్ల బారిన పడే అవకాశం ఉందని వ్యవసాయ శాస్త్రవేతలు అంటున్నారు.

- రసాయనిక ఎరువులతో పంటలకు నష్టం
- సాగులో వృథా ఖర్చులు తగ్గించుకోవాలి
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్



వరినాట్లు వేస్తున్న కూలీలు

దుద్యాల్ : పంటల సాగులో అధికంగా యూరియా వాడితే అనర్థమే అని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. సాధ్యమైనంత వరకు రసాయనిక ఎరువులను తక్కువగా వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా వరి సాగులో వృథా ఖర్చులను తగ్గించుకుంటే అధిక ఆదాయం పొందవచ్చని వివరిస్తున్నారు.

నత్రజని అవసరం..

వరిపైరు ఏపుగా పెరిగేందుకు, అధిక పిలకలతో దుబ్బు చేయడానికి, వెన్నులు బాగా రావడానికి నత్రజని చాలా అవసరం. యూరియా దుక్కిలో పిలుకలు పెట్టె దశలో, చిరుపొట్ట దశలో రకాన్ని బట్టి ఎకరాకు ఒకసారికి 35 కిలోల నుంచి 45 కిలోల వరకు వేయడానికి వ్యవసాయ అధికారులు సిఫార్స్ చేస్తారు. కానీ, కొందరు రైతులు వరినాటిన రెండు నుంచి మూడు వారాల కాల వ్యవధిలో పిలకలు అధికంగా వస్తాయనే ఊహలో మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వాడుతున్నారు. అధికంగా వాడడం వల్ల పంటకు మేలు కంటే కీడు అధికంగా జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. యూరియా అధికంగా వాడడం వల్ల ఆకు రంగు ఆకుపచ్చగా మారి చీడపీడలకు గురయ్యే అవకాశాలు అధికంగా ఉన్నాయి. పైరుకు వాడిన యూరియాలో మొక్క 30 నుంచి 35 శాతం వరకు మాత్రమే వినియోగించుకుంటుంది. మిగతాది వృథా అవుతుందంటున్నారు.

దుక్కిలో కాంప్లెక్స్ ఎరువులు వద్దు

వరిలో పిలకల దశలో యూరియాతో పాటు చాలా మంది రైతులు డీఏపీ, 20–20–20 వంటి కాంప్లెక్స్ ఎరువులను ఎకరాకు ఒక బస్త చొప్పున వేస్తుంటారు. ఈ కాంప్లెక్సు ఎరువులో ఉండే భాస్వరం కేవలం 20 నుంచి 25 శాతం మాత్రమే మొక్కలు అందుతుంది. మిగతాది అంతా భూమిలో కలిసిపోయి మొక్కలకు అందని దశకు చేరుకుంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న యూరియా, కాంప్లెక్స్ ఎరువులు

అవగాహన కల్పిస్తున్నాం



వరితో పాటు ఇతర పంటల సాగులో రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి. ప్రధానంగా యూరియాను ఎక్కువగా వాడుతున్నారు. దీంతో నష్టాలే అధికం. సేంద్రియ ఎరువులను వినియోగిస్తే మంచిది. భూములకు రక్షణతో పాటు ఆరోగ్యానికి మంచిది. గ్రామాల్లోని రైతులకు యూరియా వాడకంపై అవగాహన కల్పిస్తున్నాం

గోపాల్ , జిల్లా వ్యవసాయ అధికారి, వికారాబాద్